క్లుప్తంగా

ఆరోగ్య సేవలు విస్తరించాలి



తమ్మరాజుపల్లె వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జగదీష్ చంద్రారెడ్డి

పాణ్యం: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నంద్యాల జిల్లా ఫ్యామిలీ డాక్టర్ అధికారి జగదీష్‌చంద్రారెడ్డి సూచించారు. ఆయన సోమవారం మండల పరిధిలోని తమ్మరాజుపల్లె హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మంచానికి పరిమితమైన ఉన్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, నడవలేని వారికి ఇంటి వద్దకు వెళ్లి చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలోని ప్రజలకు 11 రకాల ఆర్యో పరీక్షలు చేసి మెరుగైన చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆరోగ్య సేవలను విస్తరించాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది బాధ్యతగా సేవలందించాలని ఆదేశించారు.అనంతరం ఆరోగ్య కేంద్రం రికార్డులను తనిఖీ చేశారు. డాక్టర్లు అభిషేక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం



పట్టుబడిన నాటుసారాను చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్ : కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం లక్ష్మీనగరం గ్రామంలో సోమవారం సెబ్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రంగస్వామి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 20లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో కోడుమూరు సెబ్ సీఐ రామాంజినేయులు, ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, వెంకటేష్‌నాయక్, సువర్ణమ్మ పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం



బిలకలగూడూరు-నంద్యాల మార్గంలో ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు నుంచి నంద్యాలకు వెళ్లే రహదారిలో ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని ఎలక్ట్రికల్ ఏఈ ఖలీల్ పాషా సోమవారం పరిశీలించారు.ఈ సమస్యపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'ఒరిగిన విద్యుత్ స్తంభం' కథనానికి విద్యుత్ సిబ్బంది స్పందించారు. ఈ మేరకు సిబ్బంది మురళీ మోహన్‌రెడ్డి, శివ, జనార్ధన్ తదితరులు సోమవారం విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల ప్రశాంతతకు సహకరించాలి



ముస్లింలతో మాట్లాడుతున్న సీఐ తబ్రేజ్

సి.బెళగల్: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేందుకు ముస్లిం పెద్దలు, ప్రజలు సహకరించాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ కోరారు. సోమవారం స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సి.బెళగల్‌కు చెందిన ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగే అన్ని ఉత్సవాలు, వేడుకలు, పండుగలను ప్రజలంతా కలిసి జరుపుకోవాలని సూచించారు. హిందూ, ముస్లింలు శాంతియుతంగా, సోదరభావంతో మెలగాలన్నారు. సాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి

వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరిగేలా పోలీస్ సిబ్బంది వ్యవహరించాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన బందోబస్తు సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలు, భక్తులు గ్రామాల్లో వినాయక ఉత్సవ వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎవ్వరికి ఎలాంటి అవరోధం కలుగకుండా చూడాలన్నారు. మండలంలోని నిమజ్జనానికి తన తో పాటు ముగ్గురు ఏఎస్ఐలు, ఎనిమిది మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 19 మంది పోలీస్ కానిస్టేబుళ్లతో బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

28న కవయిత్రుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: గణేష్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నగర శివారు ఆర్టీసీ కాలనీలోని గణేష్ సాహితీ సదన్‌లో 7వ జాతీయ కవయిత్రుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంస్థ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్త తెలిపారు. ఈ సమ్మేళనంలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 17వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలు, పేర్ల నమోదుకు 94402 28999 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బాబుకు ప్రజల ఉసురు తగులుతుంది

- వరద సహాయ చర్యలు చేపట్టడంలో విఫలం
- వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్



కోడుమూరు రూరల్ : వరద విపత్తు నుంచి విజయవాడ వాసులను రక్షించకుండా నిర్లక్ష్యం చేసిన ఏపీ సీఎం చంద్రబాబుకు, మంత్రులకు ప్రజల ఉసురు తప్పక తగులుతుందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ముందస్తు సమాచారం తెలిసినప్పటికీ వరద నుంచి లక్షలాది ప్రజల ను అప్రమత్తం చేయడంతో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కేవలం సీఎం చంద్రబాబు ఇల్లు మునగకుండా, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్‌ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకు బుడమేరు నుంచి వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడలోకి నీళ్లు వదిలారని విమర్శించారు. ప్రకాశం బ్యారేజీని బోట్లు ఢీకొనడం, బుడమేరు కాల్వ గట్టు తెగిపోవడం కుట్రకోణమని ప్రజలను తప్పుదోవ పట్టించి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఆడుతున్న నాటకమని ప్రజలు గ్రహించాలి. వరదల్లో నిండా మునిగిన ప్రజలకు వారం రోజులు గడిచినా ఇంత వరకూ సాయమందించలేదంటే ఏ మేర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో ఇట్టే అర్థమవుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ పచ్చమీడియాతో కలిసి వరద ప్రభావితత ప్రాంతాల్లో తిరుగుతూ షో నిర్వహిస్తూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఇకనైనా చంద్రబాబు, కూటమి నేతలు పచ్చమీడియాతో కలిసి నిర్వహిస్తున్న షోలు మానుకుని వరదబాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటే బాగుంటుందన్నారు. ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులు, సరుకులు సకాలంలో అందించి ఆదుకోవాలి.





సి.బెళగల్లో వినాయక నిమజ్జనంలో చిందులు వేస్తున్న యువత సి.బెళగల్లోని శ్రీ వాల్మీకి రామాలయంలో అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు , విగ్రహాల ఊరేగింపు





పాణ్యంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

బొజ్జ గణపయ్యా.. సెలవయ్యా

- వైభవంగా వినాయక విగ్రహాల నిమజ్జనం
- వేలంలో రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు పలికిన లడ్డూలు
- వేలాల్లో పాల్గొని మతసామరస్యం చాటిన ముస్లింలు



కోడుమూరులో విగ్రహాలను బావిలో నిమజ్జనం చేస్తున్న అధికారులు, నిమజ్జన కమిటీ సభ్యులు

కోడుమూరు రూరల్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కోడుమూరులో వాడవాడలా కొలువుదీరిన గణపతులను సోమవారం సాయంత్రం పట్టణంలోని వెంకటగిరి రోడ్డు వైపున్న నిమజ్జనబావిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా వినాయకులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనాలపై ఆశీనులు గావించి మేళతాళాల మధ్య మెయిన్‌బజార్ గుండా ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. సాయంత్రం 3గంటల నుంచి రాత్రి వరకు వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. నిమజ్జన బావి వద్ద విగ్రహాలకు గ్రామ సర్పంచు భాగ్యరత్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాసులు, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, నిమజ్జన కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాల నిమజ్జనాన్ని ప్రారంభించారు. కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. మండలంలోని వర్కూరు, వెంకటగిరి, క్రిష్టాపురం, ముడుమలగుర్తి, గోరంట్ల, పులకుర్తి తదితర గ్రామాల్లో కూడా వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకున్నారు.

గూడూరులో..

గూడూరులో వాడవాడలా కొలువుదీరిన గణనాథులు నిమజ్జనానికి సోమవారం సాయంత్రం తరలివెళ్లారు. గూడూరులోని కొలువుదీరిన గణనాథులను సుంకేసుల ప్రాజెక్టు వద్ద ఉన్న కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమాన్ని కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, కోడుమూరు సీఐ తబ్రేజ్ పర్యవేక్షించగా, గూడూరు ఎస్ఐ తిమ్మయ్య తన సిబ్బందితో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

సి.బెళగల్: మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం మండల ప్రజలు, భక్తులు సోమవారం వైభవంగా నిర్వహించుకున్నారు. మూడు రోజులుగా గ్రామాలలో పూజలు అందుకున్న గణనాథులను భక్తులు ఘనంగా సాగనంపారు. నిమజ్జన కార్యక్రమాలతో వినాయక మండపాల వద్ద కోలాహలం కనిపించింది. మధ్యాహ్నం నుంచే యువత కేరింతలు కొడుతూ విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన నీటి ఉట్లను పగుల కొట్టారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు వినాయకుడి చేతిలోని లడ్డూలను, పూజ టెంకాయలను, చెరకు గడలను వేలాలను నిర్వహించారు. ఇందులో లడ్డు, స్వామి వారి టెంకాయలను వేలం పాటలో అధిక ధరలను చెల్లించి భక్తులు సొంతం చేసుకున్నారు. దాదాపు ప్రతి విగ్రహం దగ్గర రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు లడ్డూ ధర పలికినట్లు ఆయా గ్రామాల ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. కాగా కొన్ని మండపాల వద్ద జరిగిన పూజా వస్తువుల వేలం పాట, అన్నదాన కార్యక్రమాల్లో ముస్లింలు పాల్గొని మతసామరస్యాన్ని చాటారు. మండల కేంద్రం సి.బెళగల్ ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను గ్రామానికి చెందిన ముందరింటి తిప్పారెడ్డి అనే వ్యక్తి వేలంలో రూ. 18,516లకు, పచ్చి టెంకాయను గ్రామానికి చెందిన ధనియాల వెంకటేష్ రూ.8,516లకు సొంతం చేసుకున్నారు. అనంతరం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు విగ్రహాలను ట్రాక్టర్లలో, ఆటోలలో సి.బెళగల్ చెరువులోకి తరలించి గణనాథుల నిమజ్జన కార్యక్రమంను నిర్వహించారు.

వినాయకా.. సెలవిక

గడివేముల: జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై.. అంటూ గ్రామాల్లో కొలువైన గణనాథులను సోమవారం నిమజ్జనానికి తరలించారు. గడివేముల మండలంలో మొత్తం 65 విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. మండల కేంద్రం మినహా అన్ని గ్రామాల్లో చిన్నా, పెద్దా, మహిళలు అనే తేడాలేకుండా భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకల్లో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. వినాయకుడి లడ్డూలను వేలంలో సొంతం చేసుకునేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. స్వామివారితోపాటుగా పూజలందుకున్న లడ్డూను సొంతం చేసుకుని పొడిని పంట పొలాల్లో చల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తుల నమ్మకం. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

పాణ్యం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కొలువుదీరిన గణనాథులు మూడవ రోజు సోమవారం నిమజ్జనానికి తరలివెళ్లారు. సాయంత్రం పోలీసులు అధికారుల సూచనల మేరకు గ్రామాల్లోని విగ్రహాలను తరలించారు. యువకులు, గజ ఈతగాళ్ల సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేశారు. అంతకుముందు వినాయక శోభాయాత్రలో గ్రామప్రజలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ నృత్యాలతో విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. యువకులుడ్యాన్స్ చేస్తూ ఆనందం పంచుకున్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ, ఎర్రకత్వ, కొలంపల్లి తండా, చిన్నటేకూరు, పెద్దటేకూరుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన వినాయక విగ్రహాలను హంద్రీ నీవా కాల్వలో నిమజ్జనం చేస్తారు. ఇందుకోసం చిన్నటేకూరు నుంచి ఉలిందకొండకు వెళ్లే రోడ్డులోని రైల్వే గేటు సమీపంలో హంద్రీ నీవా కాల్వ వద్ద జేసీబీతో కంప చెట్లు తొలగించి, లైట్లు వేయించి, రోప్ తదితర ఏర్పాట్లు చేశారు. నిమజ్జనం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ తెలిపారు.









గగ్గటూరులో వినాయకుడి శోభాయాత్రలో గ్రామస్తుల ఆనందోత్సవం, కల్లూరు: హంద్రీ నీవా కాల్వ వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు కోడుమూరులో ఊరేగింపుగా తరలి వెళుతున్న వినాయక విగ్రహాలు, రాత్రి సమయంలోనూ నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు

గంగమ్మ ఒడికి గణనాథుడు

ఓర్వకల్లు: మూడు రోజుల పాటు భక్తుల నుంచి పూజలు అందుకున్న గననాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో కలిపి మొత్తం 120 విగ్రహాలను కొలువుంచారు. ఇందులో ఓర్వకల్లు, హుసేనాపురం, కేతవరం గ్రామాల్లో మినహా, మిగతా గ్రామాలలో వినాయకులను సోమవారం నిమజ్జనానికి తరలించారు. సోమవారం సాయంత్రం గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ సమీపంలోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. ఎస్ఐ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఓర్వకల్లు, హుసేనాపురం, కేతవరం గ్రామాలలో మంగళవారం నిమజ్జనం చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్లూరు: మండలంలోని ఉలిందకొండ చిన్నటేకూరు, బస్తిపాడు, పెద్దటేకూరు తదితర గ్రామాల్లో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలకు మూడు రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సోమవారం మధ్యాహ్నం వినాయక మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో వినాయక శోభాయాత్రలో యువత నృత్యాలు, డప్పు వాయిద్యాలు, సంబరాలతో నిమజ్జనానికి తరలించారు.



పూడిచెర్లలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం

- ఎన్నడూ లేనివిధంగా టీడీపీ పాలనలో పెరిగిన దాడులు
- ఒండుట్ల రవీంద్రారెడ్డి కటుంబానికి ఆర్థిక సాయం అందించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వెంకటరమణకు చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు అన్ని విధాలా అండగా ఉంటామని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు. గత జూలై 2వ తేదీన టీడీపీ నాయకుల దాడిలో గడివేముల మండలం ఒండుట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గంజర్ల రవీంద్రారెడ్డి, వెంకటరమణ తీవ్ర గాయాలపాలైన సంగతి తెలిసిందే. వారికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.50 వేల చెక్కులను మంజూరుచేశారు. ఈ చెక్కులను రవీంద్రారెడ్డి భార్య స్రవంతికి కాటసాని ఉమామహేశ్వరమ్మ, వెంకటరమణకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే సొంతంగా రూ.50 వేలు అందించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించడం తగదన్నారు. గత ఐదేళ్లలో తమ ప్రభుత్వంలో ఇలాంటి దాడులకు తావు లేకుండా సంక్షేమ పాలన అందించినట్లు గుర్తుచేశారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పాఠశాలకు తాళం వేసి నిరసన



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తాళం వేసి విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న బైన్‌దొడ్డి గ్రామస్తులు

- సస్పెండైన ఉపాధ్యాయుడు వద్దంటున్న బైన్‌దొడ్డి వాసులు

కోడుమూరు రూరల్: సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడు తమ పాఠశాలకు వద్దని, ప్రస్తుతం పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ బదిలీ ఆపాలంటూ సోమవారం బైన్‌దొడ్డి గ్రామస్తులు పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. బైన్‌దొడ్డి స్కూల్లో ఇద్దరు టీచర్‌లు సక్రమంగా పనిచేస్తున్నారన్నారు. అయితే కోడుమూరు ఎంఈఓ మాత్రం దేవనకొండ మండలంలో వివిధ రకాల ఆరోపణలతో సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడిని డెప్యూటేషన్ పేరుతో బైన్‌దొడ్డి పాఠశాలకు వేసి, ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు టీచర్లలో ఒకరిని వేరే పాఠశాలకు బదిలీ చేశారన్నారు. తమ బాలికల భద్రత దృష్ట్యా ఆ ఉపాధ్యాయుడు తమ పాఠశాలకు వద్దని డీఈఓ, ఎంఈఓలను కలిసి విన్నవించినా వారు ఏ మాత్రం స్పందించడం లేదన్నారు. ఇలాగైతే తమ ఊరిలో పాఠశాల అవసరం లేదని, పాఠశాలను తెరవనివ్వమంటూ భీష్మించారు. గ్రామస్తుల నిరసనకు స్పందించిన కోడుమూరు ఎంఈఓ వసంతలక్ష్మి పిల్లల తలిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, టీచర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని, పాఠశాలను తెరువాలని కోరారు. దీంతో గ్రామస్తులు పాఠశాలకు వేసిన తాళాన్ని తీసి పిల్లలను యథాతథంగా బడికి పంపారు. నిరసనలో గ్రామస్తులు వీరేంద్ర, శంకర్, దస్తగిరి, ఈరన్న, నాయుడు, హనుమంతు, వీరన్న, వెంకి, చిన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం మాటున ప్రమాదం



స్తంభానికి అలుకున్న తీగలు

కల్లూరు: అర్బన్ పరిధిలోని కిసాన్‌నగర్‌లో విద్యుత్ స్తంభానికి చెట్ల తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. ఈ పిచ్చి చెట్ల తీగలు ఒక స్తంభం నుంచి మరో స్తంభానికి వ్యాపిస్తున్నాయి. స్తంభాలకు ఉన్న డిష్ వైర్లు, విద్యుత్ వైర్ల వెంట అల్లుకుంటూ మొత్తం కప్పివేశాయి. దీంతో పచ్చదనం మాటున విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కర్నూలు సిటీ: కర్నూలు-2 డిపో పరిధిలోని గ్రామాలకు సంబంధించి బస్సు రవాణా సమస్యల పరిష్కారం కొరకు, సలహాలు స్వీకరించేందుకు నేడు(మంగళవారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సర్దార్ హుసేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రయాణికులు 99592 25794 నంబకు ఫోన్ చేసి సమస్యలు తెలుపవచ్చన్నారు.

పంట కాలువను కబ్జా చేశారు

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆర్డీఎస్ కాలువను పూడ్చి, ప్లాట్లు వేసి అమ్మకాలు చేస్తూ, రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వి.నారాయణ తెలిపారు. ఆర్‌డీఎస్ కాలువ ద్వారా దాదాపు 3 వేల ఎకరాలకు నీళ్లు వచ్చేవని, అదే కాలువ వెంబడి ఉండే దారిలో రైతులు పొలాలకు వెళ్లి పంటలు పండించుకుంటూ జీవిస్తున్నారని, అలాంటి కాల్వను పూడ్చి, రైతులకు వారి పొలాలకు దారి లేకుండా చేశారన్నారు. పంచలింగాల గ్రామంలో రైతు పొలాలకు ఉండే దారిని కబ్జా చేసిన ప్రాంతాన్ని, కాలువ పూడ్చిన ప్రాంతాన్ని మండల కార్యదర్శి పి.బి.ఉషనయ్య, మండల నాయకులు, గ్రామ మాజీ సర్పంచు బి.వెంకటేశ్వర్లు, రైతులు ఎం.ఆదాము, ఉషనయ్య, అబ్దుల్‌తో కలసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కాలువ పూడ్చివేతలో పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు.



పంట కాలువ దుస్థితిని చూపుతున్న సీపీఎం నాయకులు

రెండవ రోజు తప్పని తిప్పలు

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం అటవీ ఘాట్ మలుపులో ఓ ట్యాంకర్ వాహనం సాంకేతిక సమస్య వల్ల అడ్డంగా నిలిచిపోయింది. ఈ ట్యాంకర్ లోడ్‌తో కొండపైకి వెళ్లే క్రమంలో క్లచ్ ప్లేట్స్ డ్యామేజీ, ఇతర సమస్యలతో రోడ్డుకు అడ్డంగా ఆగిపోయింది. దీంతో పిన్నాపురం నుంచి వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఘాట్‌లోని మలుపు వద్ద కేవలం బైక్ వెళ్లేందుకు మాత్రమే అవకాశం ఉండడంతో ప్రజలు బైక్‌లపై రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గ్రామానికి వెళ్లే బస్సు సుగాలిమెట్ట వద్దకు వెళ్లి తిరిగి వస్తోంది. ట్యాంకర్ పిన్నాపురంలోని గ్రీన్‌కో పరిశ్రమకు పౌడర్‌ను తీసుకెళ్తుంది. కాల్వబుగ్గ గ్రామం మీదుగా వెళ్లాల్సిన ఈ ట్యాంకర్ దారితప్పి ఘాట్‌లో రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. వాహనానికి త్వరగా మరమ్మతులు చేసి రోడ్డుకు అడ్డం తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పిన్నాపురం ఘాట్ మలుపు వద్ద నిలిచిపోయిన ట్యాంకర్